
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
బుధవారం 13 మే 2026

# సీఎం వేదిక ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి, మే 12 (అనంత ప్రభ)
ఈ నెల 15న పుట్టపర్తిలో జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు.

పుట్టపర్తిలో సీఎం సభ, పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తో పాటు జేసీ మంత్రి మౌర్య భరద్వాజ్ ,ఏఎస్పీ అంకిత సూరానా, జిల్లా అధికారులతో కలిసి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం పరిశీలించారు.

సీఎం సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం పర్యటనను విజయవంతం చేయాలని మున్సిపల్ మెప్మా గ్రామైక్య సభ్యులు, కూటమి పార్టీల నాయకులతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి పుట్టపర్తి కేంద్ర బిందువుగా మారబోతుందని అన్నారు. లక్ష కోట్లతో యుద్ధ విమానాల విడిభాగాల తయారీ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో గర్వ కారణమన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల పుట్టపర్తి ప్రాంతంలో సుమారు 20వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దేశంలోనే ఇంత భారీ స్థాయిలో పుట్టపర్తి ప్రాంతంలో పెద్ద పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అత్యంత కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటనతో పుట్టపర్తికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.



ఈ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించి, భారీ ఎత్తున ప్రజలను సమీకరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్, ఆర్డీవో సు , డి.ఎస్.పి నారాయణస్వామి, డీఎస్ఓ వంశీకృష్ణ, ట్రాన్స్కో ఎస్సీ మోషేస్ , డిపిఓ సమత ,ఈఈ శివరాముడు ,ఇతర అధికారులు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు బోయ రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, రత్నప్ప చౌదరి ,ఎల్ఐసి నరసింహులు ,శ్రీరామ్ రెడ్డి , బెస్త చలపతి , ఒలిపి శ్రీనివాసులు, సలాం ఖాన్ , బేకరి నాయుడు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పుట్టపర్తిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధికి కొత్త దిశ





పుట్టపర్తి, మే 12 (అనంత ప్రభ)
పుట్టపర్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈప్రాంత అభివృద్ధికి కొత్త దిశ దక్కనుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు.
పుట్టపర్తిలో లక్ష కోట్ల వ్యయంతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఎంతో కృషి చేశారని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. అలాగే ఆమడగూరులో రూ.51 వేల కోట్లతో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుండటం నియోజకవర్గ రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో సాధ్యమైందన్నారు. పుట్టపర్తిలో 650 ఎకరాలలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ ఈ ప్రాంతంపై ఆసక్తి చూపారని అందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యసాయిబాబా నడయాడిన పుణ్యక్షేత్రంపై ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక అభిమానం ఉందని గత ఏడాదిలో సత్య సాయి బాబా శతజయంతోత్సవాలకు విచ్చేసిన సందర్భంగా ఈ ప్రాంత ప్రజలపై ప్రత్యేక అభిమానంతో పరిశ్రమలు ఏర్పాటుకు ఎంతో మొగ్గు చూపారని కొనియాడారు. ఈనెల 15న పుట్టపర్తికి జూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మరియు కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తోపాటు ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇతర మంత్రులు పర్యటన సందర్భంగా ఏర్పాట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కేంద్ర రక్షణ శాఖ అధికారులు జిల్లా ప్రభుత్వ అధికారులు తదితరులు కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు.
ఈ పరిశ్రమల ద్వారా క్షేత్రస్థాయిలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే దేశ అభివృద్ధి దిశగా పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
మే 15న పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సతీష్ బాబు, కేంద్ర రక్షణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
పుట్టపర్తి ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు.

## ఉపాధి హామీ పని హాజరు శాతం తగ్గితే చర్యలు తప్పవు, ఎన్ఆర్జిఎస్ పిడి

- క్షేత్రస్థాయిలో తగ్గిన పని శాతం
- ఉపాధి హామీ కూలీలకు పని వద్ద కనిపించని నీడ టెంట్లు
- పర్యవేక్షణ లేని ఉపాధి హామీ ప్రధాన అధికారి, టెక్నికల్ అసిస్టెంట్స్



కూడేరు, మే 12 (అనంత ప్రభ)
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల ను దృష్టిలో ఉంచుకొని వారి ఉపాధి కోసం అదనపు పని దినాలను పెంచి ఖచ్చితమైన సమయంలో వారికి పని కల్పించాలంటు ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ కూడేరు మండల కేంద్రంలో ఉపాధి కూలీలు డిమాండ్ పెట్టుకున్నప్పటికీ సరైన సమయంలో ఎనర్జీఎస్ ప్రధాన అధికారి, టెక్నికల్ అసిస్టెంట్స్ పని దినాలు కల్పించలేదంటూ మరి పనిలో ఉపాధి హామీ కూలీల శాతం కూడా పూర్తిగా తగ్గిందని ఉపాధి హామీ కూలీలు ఫిర్యాదు మేరకు ఎన్ ఆర్ జి ఎస్ పి డి సలీం బాబా పనిలో ఉపాధి కూలీల పని శాతం తగ్గితే మాత్రం చర్యలు తప్పని ఉపాధి హామీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం అందరికీ తెలిసిందే, అయినప్పటికీ ఉపాధి హామీ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పని దినాలు కల్పించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ పీడి ఆదేశాలను పక్కకు పెట్టి కూలీలకు సగటున పని దినాలను కల్పించకపోవడంతో ఉపాధి హామీ కూలీలు అధికారులపై మండిపడ్డారు. అలాగే ఉపాధి హామీ పని వద్ద తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకొని కూలీల విశ్రాంతి, రక్షణ కోసం ఎండకు వేడిమికి నీడను ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మరి పని వద్ద ఎండ రక్షణ కోసం ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన తార్బలీన్ పట్లను, చలవనిచ్చే మజ్జిగ ప్యాకెట్లను ఎందుకు పంపిణీ చేయడం లేదని ఉపాధి కూలీలు ఉపాధి హామీ ప్రధాన అధికారులపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరొక వైపు ఉపాధి హామీ పనిలో కష్టపడి పనిచేసే వారు చేస్తా ఉంటే పని చేసినట్టుగా ఫోటో క్యాప్సర్ చేసి మధ్యలోనే వెళ్లిపోతున్నారని పని గంటలు పూర్తి అయ్యే సమయానికి పని జరిగే ప్రాంతం వద్దకు వద్దకు ఫోటో క్యాప్చర్ చేసుకొని వేతనం పొందడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. అయితే అధికారులకు అంతా తెలిసే జరుగుతున్నప్పటకి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని దాంతో ఉపాధి హామీ కూలీలు పని కావాలని డిమాండ్ పెట్టుకున్నప్పటికీ అధికారం నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## హనుమంతుని సేవలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
## హనుమాన్ జయంతి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అనంతపురం, మే 12 (అనంత ప్రభ)
అనంతపురం హనుమజ్జయంతి సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హనుమంతుని సేవలో గడిపారు. ఆయన పలు ఆలయాలకు వెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా నగరంలోని మారుతి నగర్ మొదటి క్రాస్ లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లారు. ఆ తర్వాత మధ్యాహ్నం కోర్టు రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించుకున్నారు. హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. భారీ ఏకశిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, టిడిపి నాయకులు కూడా ఆలయాలను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. కోర్టు రోడ్డులోని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. భక్తులకు స్వయంగా ఆయన భోజనం వడ్డించారు. భక్తులు ఆలయాలకు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఆయన హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిపై ఆంజనేయస్వామి ఆశీస్సులు, కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. హనుమంతుని జీవితం ప్రజలందరికీ ఆదర్శమన్నారు. శ్రీరామచంద్రునికి, సీతమ్మ తల్లికి హనుమంతుడు ఎంత నమ్మకంగా, భక్తితో ఉంటారో అందరికీ తెలుసున్నారు. తమ దేవునికి కష్టం వస్తే హనుమంతుడు ఎంత దూరమైన వెళ్తాడన్నది రామాయణంలో చూశామన్నారు. హనుమంతుని ధైర్య, సహసాలు, భక్తి గురించి మనం ఎప్పటికీ స్మరించుకుంటూనే ఉంటామన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్ కి హనుమంతుని ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరుకున్నట్లు తెలిపారు..

## కూటమి పెద్దలు ఏకతాటిపైకి రావాలి : ముగ్ధాం భాష





ఆదోని, మే 12 (అనంత ప్రభ)
నిన్న కుప్పగల్ గ్రామంలో బీజేపీ నాయకులు, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను మాదిరే సొసైటీ డైరెక్టర్ ముగ్ధాం భాష పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకత్వంపై ఘాటుగా స్పందించారు. గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఎక్కడో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని, ముందుగా కూటమి పెద్దలే ఏకతాటిపైకి రావాలని సూచించారు. నాయకులు కలిసి ఉంటేనే గ్రామస్థాయిలో కార్యకర్తలు సఖ్యతగా ఉంటారని పేర్కొన్నారు.
ఆదోని నియోజకవర్గంలో కూటమిలోని మూడు పార్టీల నాయకులు మూడు విధాలుగా వ్యవహరిస్తున్నారని, అసలు కూటమి పాలన సక్రమంగా కొనసాగుతోందా అనే అనుమానం కలుగుతోందన్నారు. కూటమిలో ఎవరికి నష్టం జరిగినా చివరికి బాధపడేది కార్యకర్తలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గాయపడిన వారిని ఎమ్మెల్యే పార్థసారథి, సీనియర్ టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు పరామర్శించి సఖ్యతగా ఉండాలని సూచించారని, అదే సందేశాన్ని కూటమి పెద్దలే ముందుగా ఆచరణలో పెట్టాలని కోరారు.
గ్రామాల్లో తరచూ ఘర్షణలు చోటుచేసుకోవడం నాయకత్వ లోపానికే నిదర్శనమని, భవిష్యత్తులో ఫ్యాక్షన్ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని ఒక సీనియర్ జర్నలిస్టుగా తన అనుభవంతో హెచ్చరించారు. టీడీపీకి గ్రామస్థాయిలో బలమైన క్యాడర్ ఉందని, ఇటీవల వైసీపీ నుంచి బీజేపీలో చేరిన వారిని నియంత్రించే బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు.
రాష్ట్ర స్థాయిలో చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దీర్ఘకాలిక పొత్తుతో ముందుకు సాగుతుండగా, ఆదోని నియోజకవర్గంలో మాత్రం విభజించి పాలిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శించారు. రాజకీయ సమన్వయం లేకపోవడంతో అధికారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు బదిలీలు కోరుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. కబ్జాలపై దృష్టి పెట్టడం కంటే కార్యకర్తల సమస్యల పరిష్కారంపైనే నాయకులు దృష్టి సారించాలని కోరారు.
కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదోని నియోజకవర్గ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. చివరగా టీడీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కష్టపడుతుంటే ఆదోనిలో మాత్రం కార్యకర్తలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కూటమి పెద్దలంతా ఒక తాటిపైకి రాకపోతే ప్రశాంతమైన ఆదోని నియోజకవర్గానికి ఫ్యాక్షన్ ముద్ర పడే ప్రమాదం ఉందని ముగ్ధాం భాష ఆవేదన వ్యక్తం చేశారు

## జేసి ఎన్ ఆర్ ఎం బాయ్స్ హై స్కూల్ నందు కిషోర్ వికాసం కార్యక్రమం





తాడిపత్రి, మే 12 (అనంత ప్రభ)
జే సి ఎన్ ఆర్ ఎం బాయ్స్ హై స్కూల్ నందు కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు తాడిపత్రి సిడిపిఓ సాజిదా బేగం ముఖ్యఅతిథిగా హాజరై బాలికలకు, బాలురకు కిషోర్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత ఆహారం, ఆరోగ్యం, లైంగిక వేధింపులు, విద్యా నైపుణ్యం, ఆత్మరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లావణ్య ,ఉమాదేవి, రామలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ,పాల్గొన్నారు.

AP 4PG 13- 5- 2026 WEDNESDAYqxp_Layout 1 12-05-2026 09:37 PM Page 2



## మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు



యాడికి, మే 12(అనంత ప్రభ)
యాడికి మండల పరిధిలో వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలలో నీరు నింపించే కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ అధికారులు చేపట్టారు.
మంగళవారం పెద్దపేట గ్రామంలో యాడికి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సహకారంతో నీళ్ల ట్యాంకర్ ద్వారా మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలలో నీటిని నింపించారు. వేసవి కాలంలో పశువులు, ఇతర మూగజీవాలు దాహార్తితో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సాయి అరుణ్ కుమార్ మాట్లాడుతూ యాడికి పంచాయతీ పరిధిలో ఎక్కడైనా మూగజీవాల నీటి తొట్టెలలో నీరు లేకపోతే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో ప్రతి మూగజీవానికి తాగునీరు అందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు

## అగాపే వృద్ధాశ్రమంలో ఇష జన్మదిన వేడుకలు





యాడికి, మే12 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో మంగళవారం వేలూరి ఇష జన్మదిన వేడుకలు నిర్వహించారు. తాడిపత్రి పట్టణానికి చెందిన వేలూరి కృష్ణమూర్తి మనవరాలు, వేలూరి దీప భరత్ దంపతుల కుమార్తె ఇష నాలుగో జన్మదినాన్ని పుర-స్కరించుకుని ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పెద్దలు చిన్నారి ఇషకు ఆశీస్సులు అందజేశారు. తమకు భోజనం ఏర్పాటు చేసిన ఇష తల్లిదండ్రులకు, తాతగారైన వేలూరి కృష్ణమూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆశ్రమ ఫౌండర్ ప్రసాద్‌తో పాటు ఆశ్రమ వాసులు కూడా కుటుంబ సభ్యులను అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో పబ్బిలేటి ప్రసాద్ కుటుంబ సభ్యులు, గంటా దేవపుత్రయ్య, ప్రసాదరావు పాల్గొన్నారు

## ఘనంగా హనుమద్ జయంతి వేడుకలు



యాడికి, మే 12 (అనంత ప్రభ)
యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్యతో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### ఆదోని నియోజకవర్గంలో 17 మందికి రూ.3.99 లక్షల ఆర్థిక సాయం



ఆదోని, మే 12 (అనంత ప్రభ)
ఆదోని నియోజకవర్గ ప్రజల కష్టకాలంలో అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజాహిత పాలనలో భాగంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఈరోజు ఆదోనిలో పంపిణీ చేశారు. ఆదోని టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణ సహాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదోని నియోజకవర్గానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 3,99,447 విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలాజీ, మా భాష, నారాయణపురం శేఖర్, ఇంద్రనగర్ వలి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## లక్షుంపల్లె గ్రామములో త్రాగునీటి సమస్యకు పరిష్కారం



యాడికి, మే12 (అనంత ప్రభ)
యాడికి మండలం చందన లక్షుంపల్లె గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఉగాది నుంచి గ్రామంలోని సగం ప్రాంతానికి అదే గ్రామానికి చెందిన యాడికి సొసైటీ అధ్యక్షుడు చలమారెడ్డి తన సొంత బోరుబావి ద్వారా త్రాగునీరు అందిస్తూ వస్తున్నారు. అనంతరం గ్రామంలో శాశ్వత పరిష్కారం కోసం చలమారెడ్డి సొంత పొలంలో కొత్త బోరుబావి తవ్వించగా 980 అడుగుల లోతులో 3 ఇంచుల నీరు లభించింది. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ బోరుబావి ద్వారా లక్షుంపల్లి గ్రామానికి పూర్తిస్థాయిలో త్రాగునీటి సమస్య తీరనుందని తెలిపారు. గత ఏడాది కూడా బీసీ కాలనీలో త్రాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ. 10 లక్షల వ్యయంతో బోరు తవ్వించిన ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి నియోజకవర్గంలో ఎక్కడ నీటి సమస్య ఉన్నా వెంటనే స్పందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని గ్రామ-స్తులు పేర్కొన్నారు. ఈ సేవలకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే జె సి అస్మిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బాల బాలికల కిషోరి వికాస కార్యక్రమం



కూడేరు, మే12 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో, మంగళవారం రోజున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "కిశోరి వికాసం" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి గారు హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంవత్సరం వేసవి సెలవుల సందర్భంగా గ్రామాలలో 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికల కోసం "కిశోరి వికాసం" కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మే 1వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజుల్లో ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం బాలలు తమ జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, అలాగే సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవడం అని వివరించారు. ఈరోజు నిర్వహించిన సెషన్‌లో "నా అవసరాలు -- మన సవాళ్లు" అనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించడం జరిగింది.
అలాగే, పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యేకంగా పనిచేస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100 లేదా ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన సహాయం లభిస్తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్డిటి సిబ్బంది రామాంజనేయులు, ఐసిడిఎస్ సిబ్బంది మరియు చిన్నారులు పాల్గొన్నారు

## త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం



కూడేరు, మే 12 (అనంత ప్రభ)
కూడేరు మండల సమీపంలోని అరవకూరు చెరువు వద్ద మంగళవారం సాయంత్రం 6:51 నిమిషాలకు టాటా ఏసీ లగేజ్ వాహనం బోల్తా పడింది. టాటా ఐసీ వాహనం బళ్లారికి వెళుతుండగా అరవకూరు చెరువు కట్ట వద్దకు రాగానే బళ్లారి కి వెళుతున్న ఐచర్ వాహనాన్ని అధిగమించే సమయంలో బళ్లారి నుండి ఆర్టీసీ బస్సు ఎదురుగా రావడంతో తప్పించబోయిన టాటా ఐసీ డ్రైవర్ బ్రేక్ కొట్టడంతో టాటా ఐసి వాహనం బోల్తా పడింది. దాంతో వాహనాన్ని నడుపుతున్న టాటా ఐ సి డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### ముఖ్య అతిధులుగా హాజరైన తహశీల్దార్ ,ఎంపీడీఓ,మెడికల్ ఆఫీసర్



శింగనమల, మే 12 (అనంత ప్రభ)
శింగనమల మండలం మరవకొమ్మ క్రాసులో వెలసిన శ్రీ మరవ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తాదులు భక్తి,శ్రద్దలతో ఎంతో ఉత్సాహంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి జన్మదినం హనుమాన్ జయంతి వేడుకగా భక్తాదులు జరుపుకుంటారు. అతి పురాతనమైన శ్రీ మరవ ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తాదులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి,ఎంపీడీఓ భాస్కర్ ,సీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహినాథ్ ,డాక్టర్ శివకుమార్ ,ఆర్ఐలు విష్ణు, భాను మరియు వివిధశాఖల అధికారులు,సిబ్బంది,స్వామి వారి భక్తాదులు,మండల ప్రజలు పాల్గొన్నారు. శ్రీ ఆంజనేయుడు మనకు ధైర్యం, నమ్మకం, భక్తి ఎంత ముఖ్యమో నేర్పుతాడని భక్తుల నమ్మకం. ఆయన ఆశీస్సులతో జీవితం విజయవంతంగా సాగాలని భక్తాదులు కోరుకుంటారు. పూజలలో పాల్గొన్న భక్తాదులకు తీర్థ,ప్రసాదాలు అందించడంతో పాటు దాతలు,భక్తాదుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివపురం గ్రామ య-ువత ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

## దేశ ఆర్థిక పటిష్టత కోసం ప్రధాని మోదీ కీలక సూచనలు



ఆదోని, మే 12 (అనంత ప్రభ)
ఒక ఇంటి యజమానిగా ప్రజలందరినీ కన్నబిడ్డలుగా భావిస్తూ దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాని నరేంద్ర మోదీ కీలక సూచనలు చేశారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో దేశ ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ సంక్షోభాలు, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి భారతీయుడు "ఆర్థిక దేశభక్తి"ని చాటాలని పిలుపునిచ్చారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలపై ఒత్తిడి పెరుగుతున్న ఈ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లను కనీసం ఏడాది పాటు తగ్గించి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజా రవాణా, కార్ పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించారు. ట్రాఫిక్ మరియు ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు అవసరమైతే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి అధిక ఖర్చులను తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'వోకల్ ఫర్ లోకల్'లో భాగంగా విదేశీ ఉత్పత్తుల కంటే స్వదేశీ వస్తువుల వినియోగానికే ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా వంట నూనెల వినియోగాన్ని 10 శాతం మేర తగ్గించాలని సూచించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ సాగు వైపు అడుగులు వేయాలని కోరారు. అనవసర ప్రయాణాలను తగ్గించేందుకు ఆన్‌లైన్ సమావేశాలను ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ప్రతి పౌరుడు ఒక సైనికుడిలా తన వంతు బాధ్యత నిర్వర్తించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా భారత రూపాయి విలువను కాపాడడంతో పాటు పెరుగుతున్న కరెంట్ అకౌంట్ లోటును నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.
కునిగిరి నీలకంఠ, కర్నూలు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు, నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ కర్నూలు జిల్లా చైర్మన్.

## జనగణన సర్వేలో వేగం పెంచిన సచివాలయ ఉద్యోగులు




కూడేరు, మే 12 (అనంత ప్రభ)
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కూడేరు మండల కేంద్రంలో వార్డుల వారిగా సచివాలయ ఉద్యోగులు జనగణన సర్వే పై వేగాన్ని పెంచారు. ఒక ప్రక్క సచివాలయ ఉద్యోలు వారికి అప్పజెప్పిన విధులు నిర్వహిస్తూనే ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి జనాభా లెక్కల నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు అదనపు పనులను సైతం తూచా తప్పకుండా జనాభా ను లెక్కించటానికి సచివాలయ ఉద్యోగులు ఇల్లు ఇల్లు తిరుగుతూ ఇంటి వద్ద కుటుంబంలోని కుటుంబ సభ్యుల వివరాలను లెక్కిస్తూ బాధ్యతగా జనాభా లెక్కలు తయారు చేస్తున్నారు. సచివాలయ అధికారులు సర్వే నిర్వహిస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి వద్ద లేకున్నా పదేపదే అదే ఇంటి వద్దకే తిరుగుతూ సాయంత్రం 6 గంటల సమయం అయినా విశ్రాంతి లేకుండా కుటుంబ సభ్యుల ఇంటి వద్ద కు వెళ్లి పక్కా వివరాల ను సేకరించి జన గణన రికార్డుల్లో పొందుపరుస్తూ జనాభా లెక్కలు త-యారు చేస్తున్నారు.

## టీజీ భరత్ నివాసంలో టీడీపీ నేతల ఆత్మీయ విందు



కర్నూలు, మే 12 (అనంత ప్రభ)
కర్నూలు జిల్లాలో మంత్రి టీజీ భరత్ నివాసంలో ఈరోజు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తీపాటి నాగరాజు, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మెల్యేలు జయ నాగేశ్వర్ రెడ్డి (ఎమ్మిగనూరు), కేఈ శ్యాంబాబు (పత్తికొండ), నియోజకవర్గ ఇన్‌చార్జీలు మీనాక్షి నాయుడు (ఆదోని), వైకుంఠం జ్యోతి (ఆలూరు), రాఘవేంద్ర రెడ్డి (మంత్రాలయం)తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ విజయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని నాయకులు సంకల్పించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే దిశగా కలిసికట్టుగా ముందుకు సాగాలని నేతలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, నాయకుల మధ్య సత్సంబంధాలు, రాజకీయ సమన్వయం స్పష్టంగా కనిపించాయి

## ఒకటవ డివిజన్ లో భక్తి హనుమాన్ జయంతి



అనంతపురం, మే 12 (అనంత ప్రభ)
అనంతపురం ఒకటవ డివిజన్ అనంతపూర్ ఏర్నాల కొట్టాల నందు హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు కాలనీవాసులు భక్తులకు మరియు పంచముఖ ఆంజనేయులు ఆంజనేయులం దేవాలయ నందు భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మరియు రాజకీయాలకు ఆ తీతంగా ఈ కార్యక్రమంలో దాసరి రాము జోగి రాజేంద్ర బోయ నగేష్ మాజీ కార్పొరేటర్ లాలు చిన్న చంటి భక్తులకు తీర్థ ప్రసాదాలు మరియు అన్నదానంలో పాల్గొన్నారు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

### -- ముఖ్య అతిధిగా గుడిసె ఆది కృష్ణమ్మ



ఆదోని, మే 12 (అనంత ప్రభ)
ఆదోని నియోజకవర్గంలోని శ్రీ అనంత మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సాయిబాబా నగర్‌లో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలోని నాయి బ్రాహ్మణ కుల సభ్యులకు, ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొని, అందరిపై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, టిడిపి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు









# వేసవిలో జ్వరాన్ని తట్టుకునే శక్తి కావాలంటే చెరుకు రసం తాగాల్సిందే



వేసవికాలం దగ్గర పడిదంటే దాహం పెరిగిపోతుంది. అందరూ కొబ్బరి నీళ్ళు, పండ్ల రసాలు తాగడానికే మక్కువ చూపిస్తారు. కానీ ఒక గ్లాసు చల్లని చెర□కు రసం తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఎండలో బాగా తిరిగి వచ్చాక ఒక గ్లాసు చల్లని చెరుకు రసం తాగి చూడండి, నిమిషాల్లో శరీరం తేరుకుంటుంది. డిహైడ్రేషన్ బారిన పడకుండా తట్టుకునే శక్తి దానికి వస్తుంది. చెరుకు రసంలో ఫైబర్, ప్రోటీన్, విటమిన్ బి6, విటమిన్ సి తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందుకే చెరుకు రసాన్ని పవర్ హౌస్ అని చెప్పుకోవచ్చు. మన శరీరం కోల్పోయిన చక్కెరను తిరిగి అందించడం ద్వారా డిహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది ఈ జ్యూస్. అంతే కాదు చెరుకు రసం తాగడం వల్ల మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన చెరుకు రసం కాలేయాన్ని పలు రకాల ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. బిల్‌రూబిన్ స్థాయిలను అదుపులో ఉంచి కాలేయానికి రక్షణ కల్పిస్తుంది. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి అవసరమైన ప్రోటీన్లను, పోషకాలను ఇది భర్తీ చేస్తుంది. ఎండలో బాగా తిరిగాక వడదెబ్బ కొడితే జ్వరం రావడం సహజం. ఆ జ్వరంతో పోరాడే శక్తిని చెరుకు రసం ఇస్తుంది. కాబట్టి వారానికి రెండు మూడు సార్లు అయినా చెరుకు రసాన్ని తాగడం అలవాటు చేసుకోండి.

1. చెరుకు రసం తాగాక మూత్ర విసర్జన ఎక్కువసార్లు అవుతుంది. ఆ మూత్ర విసర్జన ద్వారా శరీరంలోని టాక్సిన్లు, ఇన్ఫెక్షన్లకు కారణమైన వైరస్‌లు బయటికి పోతాయి. అంతేకాదు చెరుకు రసం తాగడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ కూడా తగ్గుతుంది.

2. చెరుకు రసం తాగడం వల్ల జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. పొట్ట ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. మలబద్ధకం సమస్యకు చికిత్స చేస్తుంది.

3. జ్వరం వచ్చినప్పుడు వచ్చే ఇతర సమస్యల నుంచి చెరుకు రసం కాపాడుతుంది. పిల్లల్లో జ్వరం వచ్చినప్పుడు మూర్ఛ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఆ సమయంలో చెరుకు రసం తాగితే మూర్ఛ రాకుండా ఇది అడ్డుకుంటుంది. జ్వరం వచ్చినప్పుడు ప్రోటీన్లు నశిస్తాయి. వాటిని తిరిగి నింపడంలో చెరుకు రసం సహాయపడుతుంది.


4. ఈ రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలోపేతం అవుతుంది.

5. వేసవిలో చాలామంది బలహీనంగా మారుతారు. కాబట్టి కచ్చితంగా చెరుకు రసం తాగాలి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి వంటివి జీర్ణ రుగ్మతలు, కాలేయ వ్యాధులు, శ్వాస కోశ ఇన్ఫెక్షన్లు రాకుండా సహాయపడతాయి.

6. ఈ రసంలో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం, ఇనుము, పొటాషియం వంటివి ఉన్నాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ఆస్టియోపొరాసిస్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి. వైద్యులు కూడా ఒక గ్లాసు చెరుకు రసం తాగాలని సిఫారసు చేస్తున్నారు.

# పీడకలలు తరచూ వస్తున్నాయా? ప్రమాదం పొంచి ఉన్నట్టే

కలలు అందరికీ వస్తాయి. కొన్ని అందంగా ఉంటే మరికొన్ని పీడకలలు అవుతాయి. రోజూ మీకు పీడకలలు వస్తున్నాయా? ప్రతిరోజూ అలాంటి కలలే వస్తుంటే అదొక రుగ్మత అని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే అది జీవితాలపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుంది.



### అసలు నైట్ మేర్ డిజార్డర్ అంటే ఏంటి?

ఒక వ్యక్తి తన జీవితంలో బలహీనమైన లేదా భయంకరమైన కలలను పదే పదే వస్తుంటే మీరు నైట్ మేర్ డిజార్డర్ బారిన పడినట్టే. ఇదొక రకమైన పారాసొమ్నియా. వ్యాధి తీవ్రత ఆధారంగా ఈ రుగ్మత ఆధారపడి ఉంటుంది. వారానికి ఒకటి కంటే తక్కువ సార్లు పీడకలలు వస్తాయి. వారానికి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సార్లు పీడకలలు వస్తే రుగ్మత మితం ఉందని అర్థం. మరికొంతమందికి ప్రతి రాత్రి పీడకలలు వస్తాయి. దీర్ఘకాలిక పీడకల రుగ్మత అనేది ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఉంటుంది. నిద్ర మేల్కొన్న తర్వాత ఆ కలలు భయాందోళన కలిగిస్తాయి. ఈ పరిస్థితి నిద్రను దెబ్బతీస్తుంది. డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

### ఈ రుగ్మత ఎవరిని ప్రభావితం చేస్తుంది?

### ఈ వ్యాధి పిల్లలు, పెద్దలతో సహా ఎవరినైనా ప్రభావితం చేస్తుంది.

నార్కోలెప్సీ స్లీప్, అప్నియా,పీరియాడిక్ లింబ్ మూమెంట్ డిజార్డర్ ,పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ ,యాంగ్జయిటీ డిప్రెషన్

ఈ వ్యాధి లక్షణాలు
చెమటలు పట్టడం, శ్వాస ఆడకపోవడం
గుండె వేగంగా కొట్టుకోవడం,ఆందోళన,మూడ్ స్వింగ్స్,అలసట,నిద్రలేమి,ఏకాగ్రత దెబ్బతినడం,ప్రవర్తనలో మార్పులు

### నైట్ మేర్ డిజార్డర్ కి కారణమేంటి?

పీడకలలు రావడానికి సరైన కారణాలు ఏమిటనేది పరిశోధకులకు కూడా తెలియలేదు. హైపర్‌రౌసల్ కారణంగా ఇది సంభవిస్తుందనే భావన ఉంది. ఇది మానసిక స్థితిని మార్చే లక్షణం. దీని వల్ల ఎప్పుడూ చిరాకు, కోపంగా అనిపిస్తుంది. హైపర్‌రౌసల్ నిద్రపోతున్నప్పుడు మెదడులోని కొన్ని ప్రాంతాలను అతిగా చురుగ్గా ఉండేలా చేస్తుంది. దీని వల్ల పీడకలలు వస్తాయి. ఒత్తిడికి గురవుతున్న వాళ్ళు ఎక్కువగా పీడకలలకు ఎక్కువగా గురవుతారు. కొన్ని సార్లు ఇంట్లో, ఆఫీసు పని ఒత్తిళ్లు వల్ల కూడా పీడకలలు వస్తాయి. గాయాలు, శారీరక, లైంగిక వేధింపుల వల్ల కూడా ఈ కలలు రావడం సర్వసాధారణంగా జరుగుతుంది.

నిద్రలేమి మరొక కారణం. యాంటీ డిప్రెసెంట్ మందులు, రక్తపోటు మందులు ధూమపానం, మద్యపానం అలవాట్లు కూడా పీడకలలను ప్రేరేపిస్తాయి.

### చికిత్స ఉంటుందా?

ఈ వ్యాధిని గుర్తించేందుకు ప్రత్యేకమైన రోగనిర్ధారణ పరీక్షలు ఏమి ఉండవు. వచ్చిన కలల ఆధారంగా వైద్యులు గుర్తిస్తారు. టాక్ థెరపీ ద్వారా చికిత్స చేస్తారు. బిహేవియర్ థెరపీ ఆధారిత చికిత్సలు, ఇమేజరీ రిహార్సల్ థెరపీ, ఎక్స్పోజర్, రిలాక్సేషన్, రిస్క్రిప్టింగ్ థెరపీ చేస్తారు. పెద్దవారిలో చికిత్స పీడకల రుగ్మతకు అత్యంత ప్రభావవంతమైన చికిత్సగా అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ సిఫార్సు చేసింది.

ఆధారిత చికిత్సలు పీడకలలు రాకుండా తీవ్రతను తగ్గిస్తాయి. ఈ వ్యాధికి చికిత్స చేయకుండా వదిలేస్తే అది చాలా తీవ్రంగా మారుతుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే ప్రమాదం ఉంది. అందుకే తరచూ పీడకలలు వస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులని సంప్రదించడం చాలా అవసరం.

# రాత్రివేళ ఆస్తమా రాకుండా అడ్డుకోవాలంటే ఇలా చేయండి

1. రాత్రి పడుకోబోయే ముందు మీరు నిద్రించే స్థలాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోండి. ఫ్యాన్లు, అల్మారాలు దుమ్ము పట్టి ఉండడం మంచిది కాదు. అవన్నీ కూడా మీకు ఆస్తమా వచ్చే అవకాశాన్ని రాత్రి పూట పెంచుతాయి. దుమ్ములో అలెర్జీ కారకాలు ఎక్కువ.

2. మీరు వాడే తలగడలు, పరుపులు ఎప్పటికప్పుడు దుమ్ములేకుండా దులుపుకుంటూ ఉండండి. అలాగే డస్ట్ ప్రూఫ్ కవర్లను వాడడం మంచిది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్మెంటల్ హెల్త్ సైన్స్ వారు నిర్వహించిన అధ్యయనంలో బెడ్ రూమ్‌లో ఉన్న దుమ్ము పట్టిన బెడ్ షీట్లు, తలగడలు, వాటి కవర్ల వల్లే ఎక్కువగా రాత్రిపూట ఆస్తమా వస్తున్నట్టు తేలింది.

3. ఆస్తమా ఉన్నవారు తమ బెడ్ షీట్లను, పిల్లో కవర్లను ప్రతివారం వేడి నీటిలో ఉతికి ఆరేయడం మంచిది. దీని వల్ల దుమ్ములో ఉన్న సూక్ష్మక్రిములు కూడా మరణిస్తాయి.

4. చల్లని గాలి పొడిపొడిగా అనిపిస్తుంది. ఇది తీవ్రమైన ఆస్తమాకు కారణం అవుతుంది. కాబట్టి శీతాకాలంలో మీరు పడుకునే గదిలో హ్యూమిడిఫైయర్ పెట్టుకోవడం మంచిది. అలాగే ఎయిర్ ప్యూరిఫైయర్ పెట్టుకోవడం కూడా ఉత్తమం. హానికరమైన కణాలను ఇది ప్యూరిఫై చేస్తుంది.

5. పెంపుడు జంతువులకు దూరంగా ఉండండి. ముఖ్యంగా రాత్రిపూట మీ పడకగదిలోకి పెంపుడు జంతువులను రానివ్వకండి. ఆ జంతువుల నుంచి రాలే బొచ్చు కూడా ఆస్తమాను పెంచేస్తుంది.

6. రాత్రి పడుకునే ముందు ఇంట్లో ఎయిర్ ఫ్రెషనర్లు, బలమైన వాసనలు వేసే క్యాండిల్స్ వంటివి వినియోగించవద్దు. ఉబ్బసం ఉన్నవారికి ఇవన్నీ చాలా ఇబ్బందిని కలిగిస్తాయి. ఆస్తమాను ఎక్కువ చేస్తాయి.

# వేసవితాపాన్ని తట్టుకోవాలంటే రోజుకో కొబ్బరి బోండాం తాగాల్సిందే






భానుడు ఉగ్రరూపం దాల్చేశాడు. పొద్దున పది గంటలకే బయటకి వెళ్తే మొహం మాడిపోతుంది. కొన్ని ప్రదేశాల్లో రికార్డు స్థాయిలో ఎండలు నమోదవుతున్నాయి. ఎండ వేడి కారణంగా డీహైడ్రేషన్ కి ఎక్కువగా గురవుతారు. వేడి అలసటను నివారించడానికి అవసరమైన చం□్యలు తీసుకోవాలి. వదులుగా ఉండే దుస్తులు వేసుకోవడం, మొహం, చేతులు కప్పి ఉండేలా స్కార్ఫ్ కప్పుకోవడం తప్పనిసరిగా చేయాలి. హైడ్రేట్ గా ఉండటం కోసం నీళ్ళు పుష్కలంగా తాగాలి. శరీరాన్ని చల్లగా ఉంచే ఆహారాలు ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత మంచిది. వేసవి తాపాన్ని తట్టుకోవడం కోసం ఉపయోగపడే అత్యుత్తమ పానీయం కొబ్బరి నీళ్ళు. వీటి వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

ఎలక్ట్రోలైట్స్: కొబ్బరి నీళ్ళలో పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్ల అద్భుతమైన మూలం. ఈ ఖనిజాలు శరీరంలో ద్రవ సమతుల్యత కాపాడటానికి సహాయపడతాయి. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతాయి.

హైడ్రేషన్: తియ్యగా ఉండే ఈ నీళ్ళు తాగితే నిర్జలీకరణ బారిన తక్కువ పడతారు. చెమట కారణంగా కోల్పోయిన ద్రవాలని తిరిగి నింపడంలో సహాయపడుతుంది. చక్కెర లేదా అధిక కేలరీల పానీయాలకు ఇది అద్భుతమైన ప్రత్యామ్నాయం.

శీతలీకరణ: కొబ్బరి నీళ్ళలో సహజంగా శీతలీకరణ లక్షణాలు ఉన్నాయి ఇవి శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడతాయి. వేడి ఒత్తిడిని తగ్గిస్తాయి.

పోషకాలు: కొబ్బరి నీళ్ళలో కాల్షియం, ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. హీట్ వేవ్ సమయంలో ఇది చాలా ముఖ్యమైనది. వేడి ఒత్తిడి కారణంగా శరీరం అనారోగ్యం, ఇన్ఫెక్షన్ కు ఎక్కువ అవకాశం ఉంటుంది.

కేలరీలు తక్కువ: ఇందులో కేలరీలు చాలా తక్కువ. డీహైడ్రేషన్ కి దోహదపడే చక్కెర లేదా అధిక కేలరీల పానీయాలకు బదులు దీన్ని తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

లేత కొబ్బరిని స్మూతీస్ కలపడం లేదా మోజీటోస్ వంటి కాక టెయిల్ లో కలుపుకుని తీసుకోవచ్చు. లేత కొబ్బరి కాస్త తియ్యగా, కాస్త వగరుగా ఉంటుంది.

బరువు తగ్గిస్తుంది: కొబ్బరి నీళ్ళలో కేవలం 48 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో కొవ్వు శాతం సున్నా. జీర్ణక్రియ, జీవక్రియని పెంచడంలో సహాయపడే బయో యాక్టివ్ ఎంజైమ్ లను కలిగి ఉంటుంది. రోజుకి 3-4 సార్లు కొబ్బరి నీటిని తాగొచ్చు. ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి.

డిటాక్స్ డ్రింక్: శరీరాన్ని శుద్ధి చేయడంలో కొబ్బరి నీళ్ళు సహాయపడతాయి. శరీరంలోని టాక్సిన్స్ ని బయటకి పంపించి రిఫ్రెష్ గా చేస్తుంది.


జీర్ణక్రియకి సహాయపడుతుంది: ఇందులోని బయో యాక్టివ్ సమ్మేళనాలు, ఫైబర్ అధికంగా ఉంటాయి. జీర్ణక్రియకి సహాయపడతాయి. యాసిడ్ రిఫ్లక్స్ అవకాశాలను తగ్గిస్తుంది. ఒక గ్లాసు కొబ్బరి నీరు తాగితే ఉబ్బరం, ఎసిడిటీ సమస్యను దూరం చేస్తుంది.

AP 4PG 13- 5- 2026 WEDNESDAYqxp_Layout 1 12-05-2026 09:37 PM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

సినిమా

# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరవైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్ధలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com